పి.ఎస్.ఎన్. రెడ్డి

# తృప్తి

"నాకు తృప్తి లేదు..."

ఆమె మాటలకు ప్లగ్‌లో వేలు పెట్టినట్లు షాకయ్యాడతను.

తమ శోభనం జరిగి మూడు రోజులయ్యింది. నాలుగో రోజు రాత్రి తమకంగా తనను అల్లుకుపోతున్న భర్తతో అందామె.

'ఇంత బరి తెగించిందా?'-మనసులో అనుకుంటూ నోరెళ్లబెట్టాడతను.

"విజీ! ఏంటి నువ్వనేది?" అతని గొంతు తడబడింది.

"అవునండీ! మీరు నా గురించి పట్టించుకోవడం లేదు. కేవలం మీ ఆవేశం చల్లార్చుకుంటున్నారు..." ఆమె కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది.

ఆ మాటలు, అతని అహం మీద తగిలాయి. ముఖం మ్లానమయ్యింది.

"ఇంతకు ముందు నీకెవరితోనైనా సంబంధం వుందా?"

అతని ప్రశ్నకు ఆమె ఒంట్లోని నెత్తురంతా ముఖం మీదకు ఎగబాకినట్లు కందిపోయింది. అతని వైపు కోపంగా చూసింది.

"చేతగాని ప్రతి మగాడూ తన ఆడంగితనాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఇలాంటి నిందలే వేస్తాడు!" కోపంతో ఆమె ముక్కుపుటాలు అదిరాయి. ఆవేశంతో కళ్లు ఎరుపెక్కాయి. మెడ భాగం స్వేదంతో తడిసి వింతగా మెరుస్తోంది.

తప్పు చేసిన వాడిలా తల దించుకున్నాడు.

మళ్లీ ఆమే అంది-"దాంపత్యంలో తృప్తి పొందుతున్నదీ లేనిదీ తెలుసుకోడానికి మరొకరితో సంబంధం పెట్టుకోవలసిన అవసరం లేదు!"

"విజయా! అయాం సారీ!" తలెత్తకుండానే చెప్పాడతను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

కొద్దిక్షణాలు మౌనంగా దొర్లిపోయాయి.

అతను మంచంమీద వెల్లికిలా పడుకుని ఆలోచనల్లో కూరుకుపోయాడు.

ఆమె ఓ పక్కకు ఒత్తిగిలి పడుకుంది.

ఆమె వైపు చూశాడు.

పసిమిఛాయతో బ్లౌజులోంచి బహిర్గతమవుతున్న ఆమె వీపు భాగం చిరుచెమటతో తడిసి రెచ్చగొడుతూంది.

అతనిలో కోర్కెలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మనసును అదిమిపట్టటం అసాధ్యమే అయినా ఆమె ఒంటిమీద చెయ్యేసే ధైర్యం లేక నిర్లిప్తంగా వుండిపోయాడు.

తనెక్కడ విఫలమయ్యాడో అర్థం కాలేదు.

అప్పటికి మూడు రాత్రులు గడిచాయి. ఏ రాత్రీ తను చేతులు ముడుచుకుని కూర్చోలేదు. ప్రతిరాత్రీ తెల్లవారేవరకూ ఆమెను నిద్ర పోనీలేదు. తన పురుషత్వానికి ఆమె పొంగిపోతుందనుకున్నాడు. ఆమె కళ్లలోకి గర్వంగా చూశాడు.

ఆమె మాత్రం నిర్లిప్తంగానే చూసింది. ఆ చూపులో ఏదో తెలియని ఛీత్కారభావన! ఆమె ఎందుకలా ప్రవర్తిస్తూందో అర్థం కాలేదతనికి.

'ఇప్పుడు నీ సత్తా చూపించి ఆమె నోరు మూయించు!' అతనిలోని పురుషాధిక్యం రెచ్చగొట్టింది.

చాలా సేపు ఆలోచించాడు.

మనసు అవమానభారంతో ఉద్రిక్తమయింది.

తనలోని సంఘర్షణను అణిచిపెట్టడం సాధ్యం కాలేదతనికి.

ఆమె భుజం మీద చెయ్యేసి తన వైపు తిప్పుకోవాలని ప్రయత్నించాడు.

ఆమె అతని చేతిని మృదువుగా నెట్టేసింది.

అయినా ఊరుకోలేదు. మళ్లీ ప్రయత్నించాడు.

"వద్దు!" చిరాకు పడింది.

విననలేదతను. బలవంతంగా ఆమెను తన వైపు తిప్పుకున్నాడు.

ఉక్రోషంగా చూసింది.

"ఎందుకొద్దు?" చిన్నగా నవ్వడానికి ప్రయత్నించాడు.

"ఒళ్లు హూనం చేసి వదిలిపెడుతున్నారు. అంతకు మించి..." అర్థోక్తిలో ఆగింది.

ఆమె చెప్పకపోయినా ఆమె మాటల్లోని ఆంతర్యం అర్థమై అవమానభారంతో కళ్లు మూసుకున్నాడతను.

✣ ✣ ✣

మంచం మీద మూడంకె వేసుకుని చెరొక వైపూ తిరిగి పడుకోవడంతోనే రాత్రులన్నీ నిరుపయోగంగా దొర్లిపోతున్నాయి.

ఆమె మాటలు తన మగతనాన్ని సవాలు చేస్తున్న భావన రోజురోజుకూ నిరాశానిస్పృహల ఊబిలోకి నెట్టేస్తుంటే-జీవితం మీద ఏవగింపు కలిగింది. బ్రతుకంటే విరక్తి రగిలింది.

దాంపత్యమంటే రోజుకో అద్భుతమైన అనుభూతిని ఆవిష్కరించుకునే మధురక్షణాల హరివిల్లనుకుందామె. కోటి ఆశలను గుండె గదుల్లో



నింపుకుని ఎగసిపడే తరంగంలా దాంపత్యతీరాన్ని తాకిన ఆమె కోరికల ఉద్ధృతిమీద అసంతృప్తి ఉక్కుపాదం మోపి అణిచేస్తుంటే, ఆమె ఆశలు ఆవిరయ్యాయి.

బహుశా ఆ అసంతృప్తి నుంచి పుట్టిన భావోద్వేగమే అతని పట్ల తన ప్రవర్తనకు కారణమేమో!?

అతన్ని చూస్తే జాలేసిందామెకు.

"నన్ను క్షమించరూ?" అంది మథనపడుతూ.

"దేనికి?" అడిగాడతను.

"నేనలా మాట్లాడుండకూడదు!" అంది బాధగా.

"లేదు విజీ! పాతకాలపు ఆడపిల్లలా మనసులో దాచుకుని కుమిలిపోయే కన్నా, మనసు విప్పి బయటపెట్టే నువ్వంటే నాకు గౌరవం పెరిగింది. నేనే అనాలోచితంగా, సగటు మగాడిలా, చదువూ; సంస్కారం మరిచిపోయి అసభ్యంగా మాట్లాడాను!" అతని గొంతు రుద్ధమయ్యింది.

"నాలోనూ లోపముంది."

'ఏమి'టన్నట్లు చూశాడతను.

"నా అసంతృప్తిని బయటపెట్టగలిగానే కాని నాకేం కావాలో మీకు చెప్పలేకపోయాను. కొన్ని అవసరాలు అడిగి తీర్చుకోవాలి. నాలో ఏ తంత్రులు మీటితే స్పందన కలుగుతుందో మీకు తెలియనప్పుడు భాషకు బిడియం అడ్డుపడినా, భావప్రకటన ద్వారా, స్పర్శ ద్వారా తెలియజేయాల్సిన బాధ్యత నాకుంది. దాన్ని నేను విస్మరించి మిమ్మల్ని నిందించాను. అది అన్యాయం కదూ?" అందామె.

మాట్లాడుతున్న ఆమె పెదవుల మీద చెయ్యేసి ఇంకొద్దన్నట్లు కళ్లతోనే వారించాడతను.

ఆమె నవ్వింది. సమ్మోహితనరిచే దరహాసమది!

సరససంభాషణలతో మనసులు ఉత్తేజితమయ్యాయి.

రసాన్వేషణకు తనువులు సిద్ధమయ్యాయి.

లా ఆఫ్ రెడీనెస్ గుర్తుకొచ్చిందతనికి. అప్పటికి కానీ తను చేసి తప్పేంటో తెలిసింది కాదు! పార్ట్‌నర్ గురించి పూర్తిగా తెలుసుకోకపోవటమే తను చేసి పొరపాటనుకున్నాడు.

అతని చేతిలో శ్రుతి చేసిన వీణలా ఆమె!

కొత్తరుచుల కోసం అన్వేషిస్తూ...

అనుభూతులు అంబరాన్ని అంటుతుంటే...

అనిర్వచనీయమైన అలౌకికస్థితిలో కాలాన్ని మరిచి...

[illegible]శ్శబ్దయుద్ధంలో ఒకర్ని గెలిపించాలని మరొకరు ఆరాటపడుతూ...

"సందీప్! అయామ్ వెరీ హాపీ!" అతని చెవిలో మత్తుగా గొణిగిందామె. ■

